సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 24 । నవంబర్ । 2024



నగరవనం.. ఆహ్లాదకరం

పచ్చదనం.. పక్షుల కిలకిలరావాలు.. ఆహ్లాదకరమైన వాతావరణానికి నిలయంగా నూజివీడు మండలం బత్తులవారిగూడెంలోని నగరవనం ఆకర్షిస్తోంది. 8లో ▸



ధాన్యం నిల్వలో మెలకువలు

ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ధాన్యం నిల్వలో రైతులు మెలకువలు పాటించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



అలసత్వం వహిస్తే చర్యలు

పోలీసు సిబ్బంది సమష్టిగా పనిచేసి నేరాల నియంత్రణకు అడ్డుకట్ట వేయాలని, విధుల్లో అలసత్వం సహించమని పశ్చిమగోదావరి ఎస్పీ హెచ్చరించారు. 8లో ▸

ధాన్యం.. దళారుల పరం

కొనుగోళ్లలో దందా

- ఉమ్మడి జిల్లాలో భారీగా ప్రైవేట్ కొనుగోళ్లు
- తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న దళారులు
- రైతులకు మద్దతు ధర దక్కని వైనం
- ఇతర జిల్లాల నుంచి భారీగా కమీషన్ ఏజెంట్ల రాక
- నచ్చిన మిల్లుకు నిబంధనలతో అడ్డగోలుగా దందా
- దిగుబడిలో 60 శాతమే ప్రభుత్వ కొనుగోలు



ఉంగుటూరులో ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో దళారుల రంగ ప్రవేశం కూటమి ప్రభుత్వ అండదండలతో విజయవంతంగా జరిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయాలు జరిపి ప్రతి రైతుకూ మద్దతు ధర వచ్చేలా చేయడంతో పాటు దళారుల పాత్రను పూర్తిగా నిర్మూలించగలిగారు. అయితే అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రైతు నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్ముకోవచ్చని, 60 శాతం దిగుబడి మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నిబంధనలు విధించడంతో దళారుల విక్రయాలు తారాస్థాయికి చేరారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు పొరుగు జిల్లాలోని వ్యాపారులు ఇక్కడకు వచ్చి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో ధాన్యం మద్దతు ధర (75 కిలోల బస్తా) రూ.1,725 ఉన్నా రైతులకు దళారులు రూ.1,300 నుంచి రూ.1,500 మాత్రమే ముట్టజెబుతున్నారు.

వేగంగా కొనుగోళ్లు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ గత నెలాఖరులో ప్రారంభమై ప్రస్తుతం వేగంగా సాగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సీజన్‌లో మూడుసార్లు తుపానులు, రెండుసార్లు గోదావరి వరదలతో 29 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. దీంతో పాటు దిగుబడిపైనా తీవ్ర ప్రభావం చూపింది. కష్టనష్టాల నడుమ ఖరీఫ్ సీజన్ దిగుబడులు సాధించినా మద్దతు ధర మాత్రం అన్నదాతకు దక్కడం లేదు. ఏలూరు జిల్లాలో 1.80 లక్షల ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఏలూరు జిల్లాలో 5.60 లక్షల టన్నులు, పశ్చిమగోదావరి జిల్లాలో 6.10 లక్షల టన్నుల దిగుబడి అంచనా వేశారు. ఈ క్రమంలో ఏలూరు జిల్లాలో 250 రైతు సేవా కేంద్రాలకుగాను 139 కేంద్రాల్లో, పశ్చిమగోదావరి జిల్లాల్లో 265 కొనుగోళ్ల కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టింది. ఇప్పటివరకు పశ్చిమగోదావరి జిల్లాలో రూ.142 కోట్ల విలువైన 63 వేల టన్నుల ధాన్యాన్ని, ఏలూరు జిల్లాలో 79,900 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇదిలా ఉండగా రెండు జిల్లాల్లోనూ ప్రైవేట్ కొనుగోళ్లు (దళారులు) అత్యధికంగా సాగుతున్నాయి.

ఏలూరు జిల్లా	
వరి సాగు	1.80 లక్షల ఎకరాలు
ధాన్యం దిగుబడి అంచనా	5.60 లక్షల టన్నులు
కొనుగోలు లక్ష్యం	3.50 లక్షల టన్నులు
కొనుగోలు కేంద్రాలు	139
ఇప్పటివరకు కొనుగోళ్లు	79,900 టన్నులు

పశ్చిమగోదావరి జిల్లా	
వరి సాగు	2.19 లక్షల ఎకరాలు
ధాన్యం దిగుబడి అంచనా	6.10 లక్షల టన్నులు
కొనుగోలు లక్ష్యం	4.10 లక్షల టన్నులు
కొనుగోలు కేంద్రాలు	265
ఇప్పటివరకు కొనుగోళ్లు	63,000 టన్నులు



లక్ష్యం కుదించి.. రైతులను వంచించి..

జిల్లాలో స్వర్ణ, సంపత్ స్వర్ణ, పీఎల్‌తో పాటు మరో 7 వెరైటీల వరి వంగడాలను అత్యధికంగా సాగుచేస్తుంటారు. ఈ క్రమంలో తేమ 17 శాతంలోపే ఉండాలని, అలాగే రైతుకు నచ్చిన మిల్లుకు ధాన్యం తరలించవచ్చనే నిబంధనలతో ధర విషయంలో అన్నదాతలకు నష్టం జరుగుతుంది. ఏలూరు జిల్లాలో 5.60 లక్షల టన్నుల దిగుబడికి 3.50 లక్షల టన్నులు, పశ్చిమలో 6.10 లక్షల టన్నుల దిగుబడికి 4.10 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యం నిర్దేశించింది. రెండు జిల్లాల్లో కలిపి 13.70 లక్షల టన్నుల దిగుబడి వచ్చినా 60 శాతం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసేలా లక్ష్యం నిర్దేశించడంతో రైతులు అనివార్యంగా దళారులకు విక్రయిస్తున్నారు. తేమ 17 శాతం కంటే ఎక్కువగా ఉండటం, ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ప్రభుత్వం డ్రయర్లు గాని, ఇతర సౌకర్యాలు కల్పించకపోవడంతో కళ్లాల్లోనే దళారులకు అమ్మేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. అలాగే రైతుకు నచ్చిన మిల్లుకు ధాన్యాన్ని తీసుకువెళ్లవచ్చని నిబంధన కూడా కొంత ఇబ్బందికరంగా మారింది. ఏలూరు జిల్లాలో 100 మిల్లులు ఉంటే అత్యధికంగా ఏలూరులోనే ఉన్నాయి. సాగు విస్తీర్ణం అధికంగా ఉన్న ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో మిల్లులు తక్కువగా ఉండటంతో దళారులకు విక్రయించడం తప్పనిసరిగా మారింది. ఇదే అదనుగా దళారులు 75 కిలోల బస్తా ధాన్యానికి రూ.1,300 నుంచి రూ.1,500 వరకు ధర చెల్లిస్తున్నారు.

వెల్లుల్లి అ'ధర'హో

కిలో రూ.400 పైమాటే



తాడేపల్లిగూడెం: ఉల్లి ఘాటు నుంచి ఉపశమనం పొందుతున్న తరుణంలో వినియోగదారులకు వెల్లుల్లి ధరల శరాఘాతం తగిలింది. వెల్లుల్లి ధరలు ఆకాశమే హద్దుగా పరుగులు తీస్తున్నాయి. ఎన్నడూ లేనివిధంగా రకాన్ని బట్టి కిలో రూ.450కు చేరుకున్నాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి ఎక్కువగా వెల్లుల్లి మార్కెట్లకు సరఫరా అవుతాయి. సింహభాగం మధ్యప్రదేశ్ నుంచి వెల్లుల్లి వస్తుంది. ఆ రాష్ట్రంలో వెల్లుల్లి హబ్‌గా పేరొందిన వేప, మందసౌర్, రత్లాం ప్రాంతాల నుంచి సరఫరా ఉంటుంది. సుమారు 3.1 మిలియన్ టన్నుల వెల్లుల్లి మార్కెట్లకు వస్తుంటాయి. సాధారణంగా సెప్టెంబరు నుంచి అధికంగా కొత్త వెల్లుల్లి మార్కెట్‌కు వస్తుంది. ఈ ఏడాది మధ్యప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో దిగుబడులు 70 శాతం వరకు పడిపోయాయి. ఈ ప్రభావం ధరలపై పడింది. ప్రస్తుతం గూడెం మార్కెట్‌లో విడిగా కిలో వెల్లుల్లి పెద్దవి రూ.450, చిన్నవి రూ.360 నుంచి రూ.400కు విక్రయిస్తున్నాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో పెద్ద వెల్లుల్లి కిలో రూ.420, చిన్నవి రూ.320కు విక్రయిస్తున్నాయి. కొత్త పంట వచ్చే వరకూ ధరలు ఇలానే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు.

గూడెంలో వందే భారత్‌కు హాల్టు !

తాడేపల్లిగూడెం: వందే భారత్ రైలుకు తాడేపల్లిగూడెంలో హాల్టు కల్పించనున్నారు. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఇప్పటికే ఈ మేరకు రైల్వే అధికారులు సర్వే పూర్తిచేశారు. గూడెం స్టేషన్ ఏ క్లాస్ పరిధిలో ఉంది. రోజుకు సగటున రూ.3 లక్షల వరకూ ఆదాయం ఉంది. హాల్టుకు సంబంధించి నివేదికలన్నీ పంపామని తాడేపల్లిగూడెం రైల్వే అధికారి జి.దానయ్య తెలిపారు.

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రికి పరామర్శ



సూర్యనారాయణరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు

భీమవరం: పితృవియోగంతో బాధపడుతున్న కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను శనివారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పరామర్శించారు. శ్రీనివాసవర్మ నివాసం వద్ద ఆయన తండ్రి సూర్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేత్రపర్వం.. దేదీప్యమానం



శ్రీవారి సహస్ర దీపాలంకరణ సేవ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో శ్రీవారికి శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ వేడుకను కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయ సిబ్బంది మండపంలోని దీపాలను వెలిగించారు. అనంతరం అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మండపంలోని ఉయ్యాలపై వేంచేపు చేసి, ఉయ్యాలను ఊపుతూ వేడుకను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

జార్ఖండ్‌లో జిల్లా జడ్జి ఉద్యోగాలు

ఏలూరు (టూటౌన్): జార్ఖండ్ హైకోర్టు పరిధిలో 15 జిల్లా జడ్జిల నియామకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు జార్ఖండ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వివరాలు పంపారని జిల్లా జడ్జి సి.పురుషోత్తమకుమార్ తెలిపారు. బార్ అసోసియేషన్ నుంచి అర్హులైన వారి నుంచి ఈనెల 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. జనరల్ అభ్యర్థులు రూ.1,500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ.1,44,840-1,94,660 (లెవెల్ జె-5) పే స్కేలు అమలుచేస్తారన్నారు. మరిన్ని వివరాలను జార్ఖండ్ హైకోర్టు వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని పేర్కొన్నారు.

జనవరిలో హేలాపురి బాలోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వచ్చే జనవరి 24, 25 తేదీల్లో నిర్వహించే హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల సంబరాలు విజయవంతం కావాలని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ అన్నారు. శనివారం స్థానిక డీఈఓ కార్యాలయంలో బాలోత్సవం కరపత్రాలను ఆహ్వాన సంఘం ప్రతినిధుల సమక్షంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల్లో వివిధ రంగాలకు చెందిన పెద్దలు హేలాపురి బాలోత్సవం పేరుతో పిల్లల సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించేలా అందరూ తోడ్పాటు అందించాలన్నారు. విద్యాలయాల ప్రతినిధులు ప్రోత్సహించి బాలోత్సవంలో పాల్గొనేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. అడుసుమిల్లి నిర్మల, ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు పిల్లల సంబరాల నిర్వహణకు తోడ్పడిన విధంగా ఈసారీ సహకరించాలని కోరారు. బాలోత్సవాన్ని వట్లూరులోని సిద్ధార్థ ఫెస్ట్ స్కూల్‌లో నిర్వహించడానికి కమిటీ నిర్ణయించిందన్నారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి



టగ్ ఆఫ్ వార్‌లో పోలీస్ సిబ్బంది



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఐజీ, ఎస్పీ

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్
- ముగిసిన పోలీస్ స్పోర్ట్స్‌మీట్

ఏలూరు టౌన్: క్రీడలు అంటే గెలుపోటములు మాత్రమే కాదనీ, సవాళ్లను స్వీకరిస్తూ కొత్త విధానాలను నేర్చుకోవడమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏలూరు జిల్లా పోలీస్ స్పోర్ట్స్‌మీట్-24 ముగింపు వేడుకలు శనివారం జరిగాయి. ముఖ్య అతిథిగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ శక్తి, సామర్థ్యాలను నిరూపించుకునేందుకు క్రీడలు వేదిక అని అన్నారు. కృషి, పట్టుదలతో విజయం వైపు పయనిస్తూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. పతకం గెలిచినా.. లేకున్నా వేదికపై మీరంతా విజేతలేనని అభినందించారు. పోలీస్ సిబ్బంది శారీరకంగా దృఢంగా ఉండాలని, ఆరోగ్య పరిక్షణకు వ్యాయామం తప్పనిసరి అని అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ ఒక్కరుగా సాధించలేనిది జట్టుగా సాధించవచ్చనీ, ప్రతిభను ప్రదర్శించేందుకు స్పోర్ట్స్‌మీట్ వేదికగా నిలిచిందన్నారు. ఒత్తిళ్లు, బిజీ షెడ్యూల్‌లోనూ పోలీస్ అధికారులు పోటీల్లో సత్తాచాటడం అభినందనీయమన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కోరారు. క్రమశిక్షణ, ఐక్యత, క్రీడాస్ఫూర్తితో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీలు డి.శ్రావణ్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, యు.రవిచంద్ర, డీటీసీ డీఎస్పీ పి.శ్రీహరి, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థినిని చితక్కొట్టిన కరస్పాండెంట్



ఆకివీడులో విద్యార్థినికి చికిత్స చేస్తున్న వైద్యురాలు

ఆకివీడు: విద్యార్థినిని స్కూల్ కరస్పాండెంట్ చితక్కొట్టిన వైనం శనివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయం వెనుక భాగాన ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థ కరస్పాండెంట్ తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిని చెంపలు వాయించి, పీక నులిమేసి భయభ్రాంతులకు గురిచేశారు. వివరాలిలా ఉన్నాయి.. విద్యార్థిని స్కూలు ముగిసిన వెంటనే ఇంటికి వెళ్లే క్రమంలో బస్సు డ్రైవర్ అన్న మాటలను వంత పాడిన విషయాన్ని డ్రైవర్ వచ్చి కరస్పాండెంట్‌కు చెప్పాడు. దీంతో ఆగ్రహానికి గురైన కరస్పాండెంట్ కేఎస్‌వీ సత్యనారాయణ.. విద్యార్థిని చెంపలు వాచిపోయేలా కొట్టారు. అంతేగాకుండా 'నన్ను కోళ్ల డాక్టర్' అంటావా అంటూ ఆమె పీక పట్టుకుని తన ప్రతాపాన్ని ప్రదర్శించాడు. ఇదంతా సహచర విద్యార్థుల మధ్యే జరిగింది. అనంతరం విద్యార్థిని మౌనంగా ఇంటికి వెళ్లిపోయింది. విద్యార్థిని తాత నరసింహారావు స్వగ్రామం నందమిల్లిపాడు గ్రామంలో వారి ఇంటి వద్ద పెరుగుతూ చదువుకుంటోంది. చెంపలు వాయడంపై నరసింహారావు ఆరా తీయగా విద్యార్థిని జరిగిన విషయాన్ని చెప్పింది. విద్యార్థిని బంధువులు రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ఆమెను ఆకివీడు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని వద్దకు స్కూలు సిబ్బంది వచ్చి రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నరసింహారావు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును పరిశీలిస్తున్నారు.

పశువుల్లో ఏఎంఆర్‌పై అవగాహన



జిల్లా పశుగణాభివృద్ధి సంస్థలో అవగాహన కల్పిస్తున్న వైద్య నిపుణులు

పెంటపాడు: పశువుల్లో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై పశు వైద్య సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి పి.మురళీకృష్ణ అన్నారు. పశువుల్లో వ్యాధి క్షీణత వల్ల ఏర్పడే లోపాలను వైద్యులకు వివరించే ప్రక్రియలో భాగంగా శనివారం పెంటపాడులో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిపుణులైన వైద్యులు పశు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. మితిమీరిన విచక్షణారహిత మందుల వినియోగంతో ప్రజలతో పాటు పశువులకు నిరోధక శక్తి తగ్గుతుందన్నారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. పశువుల్లో ఏఎంఆర్ ప్రభావం, దాని వ్యాప్తిని అరికట్టే విధానంపై మాట్లాడారు. గన్నవరం వెటర్నరీ కళాశాల మైక్రో విభాగాధిపతి ఆనంద్‌కుమార్, వీఆర్ గూడెం బఫెల్లో రీసెర్చ్ సెంటర్ ప్రొఫెసర్ ఆనందరావు, జిల్లా ఇమ్యూనేజేషన్ అధికారి డాక్టర్ సుధ, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం డిప్యూటీ డైరెక్టర్లతో పాటు సహాయ అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ఓటరు నమోదు



విశ్వేశ్వరరావు, డీఆర్వో

ఏలూరు (మెట్రో): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ఆదివారం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని డీఆర్వో వి.విశ్వేశ్వరరావు తెలిపారు. ఆయా కేంద్రాల్లో బీఎల్‌ఓలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని, అర్హుల నుంచి 6,7,8 దరఖాస్తు ఫారాలు స్వీకరిస్తారన్నారు. ఓటర్ల నమోదు అధికారులు, తహసీల్దార్లు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి శిబిరాల నిర్వహణను పరిశీలించాలన్నారు. బీఎల్‌ఓలు స్వీకరించిన ఫారం 6,7, 8 దరఖాస్తుల నివేదికను సాయంత్రం 5 గంటలకు సంబంధిత తహసీల్దార్లు సమర్పించాలని ఆదేశించారు.

మనసారా.. మావుళ్లమ్మకు సారె





సిరుల తల్లి.. కల్పవల్లి.. భీమవరం పట్టణ ఇలవేల్పు.. భక్తుల పాలిట కొంగుబంగారం మావుళ్లమ్మవారికి శనివారం అమ్మవారి దీక్ష తీసుకున్న భక్తులు సారె సమర్పించారు. పండ్లు, స్వీట్లు, పిండి వంటలు, పసుపు, కుంకుమలు, చీర, గాజులతో దీక్షధారులు సారెను తీసుకురాగా ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సారెను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ పర్యవేక్షించారు.

- భీమవరం (ప్రకాశం చౌక్)

ఎయిడెడ్ పోస్టుల దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి పీఎంకే ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎస్‌జీటీ ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల గడువు పొడిగించినట్టు డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు డిసెంబర్ 1వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్ కాపీలతో పీఎంకే ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలకు వ్యక్తిగతంగా లేదా పోస్ట్ ద్వారా లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

భూసేకరణ వేగిరపర్చాలి

ఏలూరు (మెట్రో): జిల్లాలో ల్యాండ్ బ్యాంక్, అసైన్డ్ ల్యాండ్‌కు సంబంధించి సమగ్ర వివరాలు సమర్పించాలని తహసీల్దార్లను ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. శనివారం క్యాంపు కార్యాలయం నుంచి ఆమె జాతీయ రహదారుల ప్రాజెక్టులు, చింతలపూడి లిఫ్టు ఇరిగేషన్, అభివృద్ధి కార్యక్రమాల భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు.

నగరవనం.. ఆహ్లాదకరం

బత్తులవారిగూడెం వద్ద
అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ



నూజివీడు మండలం బత్తులవారిగూడెం వద్ద నగరవనం


ట్రెక్కింగ్ చేస్తున్న విద్యార్థులు


నగరవనంలో ఆడుకుంటున్న పిల్లలు

నూజివీడు: ఎటు చూసినా పచ్చదనం... పక్షుల కిలకిలారావాలు... రణగొణ ధ్వనులకు దూరంగా ఆహ్లాదకరమైన వాతావరణానికి నిలయంగా నూజివీడు మండలం బత్తులవారిగూడెంలోని నగరవనం అందరినీ ఆకర్షిస్తోంది. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ నగర వనం... నేటి ఆధునిక యుగంలో ఉరుకులు పరుగులు పెట్టే పట్టణ వాసికి వరం... ప్రకృతి ఒడిలో సేద తీరాలంటే నూజివీడుతో పాటు చుట్టుపక్కల ప్రాంత వాసులు ఎక్కడో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఏలూరు జిల్లాలో తొలిసారిగా నూజివీడు మండలం బత్తులవారిగూడెం అటవీ ప్లాంటేషన్‌లో నగర వనాన్ని దిద్దారు. ఇటీవలే అందుబాటులోకి వచ్చింది. వినోదం, విజ్ఞానం, ఆహ్లాదం మేళవించి దీనిని ప్రజల సౌకర్యార్థం తీర్చిదిద్దారు. 125 ఎకరాల్లో తొలి విడత రూ.1.50 కోట్లతో నగరవనం తీర్చిదిద్దారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు పూర్తయి ఇటీవలే ప్రారంభోత్సవం జరుపుకుంది.

రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నగరవనం సందర్శించవచ్చు. పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 టిక్కెట్. ప్రజలు రోజంతా ప్రకృతి ఒడిలో, పచ్చదనం తోడుగా ఉల్లాసంగా...ఉత్సాహంగా గడపవచ్చు. నగరవనంలో పిల్లలు, పెద్దలు ఆడుకునేందుకు ఉయ్యాలలు, రంగులరాట్నం, జారుడుబల్లలు ఏర్పాటు చేశారు. పచ్చదనం ఒడిలో వాకింగ్ ట్రాక్‌లు, వన్యప్రాణుల విశిష్టతను వివరించే విజ్ఞాన కేంద్రాలు, ఆయుర్వేదంలో ఉపయోగించే మొక్కలు, చెట్లు, ఎన్నో రకాల పక్షుల బొమ్మలు, వన్యప్రాణుల చిత్రాలను సిద్ధం చేస్తున్నారు. అలసిపోతే పుట్టగొడుగుల ఆకారంలో ఉండే పగోడాలు, స్నాక్స్, టిఫిన్, భోజనం చేసేందుకు క్యాంటీన్ ఏర్పాటు, పిల్లల కోసం అనేక ఆటవస్తువులు అందుబాటులో ఉంచారు. నూజివీడు పట్టణం నుంచి మైలవరం రోడ్డులో కేవలం 8 కిలోమీటర్ల దూరంలోనే ఈ నగరవనం ఉంది.

విద్యార్థులతో కోలాహలం

కార్తీకమాసం ప్రారంభమైన నాటి నుంచి నూజివీడుతో పాటు మైలవరం, విజయవాడ చుట్టుపక్కల ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ నగరవనానికి పిక్నిక్ నిమిత్తం విచ్చేస్తున్నారు. రోజువారీ పనులకు దూరంగా పగలు ప్రకృతి ఒడిలో ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు.

నగరవనం చాలా బాగుంది



బత్తులవారిగూడెం అటవీ ప్రాంతంలో ఉన్న నగరవనం ఎంతో బాగుంది. విజయవాడలో పార్కులున్నప్పటికీ వాటి కంటే ఇది చాలా బాగుంది. రోజువారీ ఒత్తిడిల నుంచి దూరంగా ప్రకృతి ఒడిలో ఉండటంతో రీచార్జ్ కావడానికి దోహదపడుతుంది.

– షేక్ సుల్తానా, రాయనపాడు, విజయవాడ

పిల్లలు, పెద్దలకూ ఆహ్లాదం పంచేలా



నగరవనం పిల్లలకే కాకుండా పెద్దలకు సైతం చాలా బాగుంది. పిల్లలు, పెద్దలు ఎన్నో రకాల ఆటలు ఆడుకోవడానికి ఏర్పాట్లు ఉన్నాయి. పెద్దలు ప్రకృతి ఒడిలో వాకింగ్ చేయడానికి కూడా ట్రాక్ ఉండటం బాగుంది. బాగుంది అంటే పిల్లలను తీసుకొని విజయవాడ నుంచి వచ్చాం.

– వీ శిరీష, విజయవాడ

క్లుప్తంగా

కోర్టు కాంప్లెక్స్ త్వరగా పూర్తి చేయాలి


భీమవరం కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి, జడ్జి సోమశేఖర్

భీమవరం: భీమవరంలో నూతనంగా చేపట్టిన కోర్టు కాంప్లెక్స్, న్యాయమూర్తుల క్వార్టర్స్ నిర్మాణం, మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మూడో అడిషనల్ జిల్లా, సెషన్స్ జడ్జి ఎంఏ సోమశేఖర్‌తో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రూ.85.60 కోట్లతో కోర్టు కాంప్లెక్స్, భీమవరం, తణుకు పట్టణాల్లోని న్యాయమూర్తుల నివాస క్వార్టర్స్ మరమత్తులు, తణుకు అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి నివాస క్వార్టర్స్ వంటి పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. జడ్జి సోమశేఖర్ మాట్లాడుతూ చిట్ ఫండ్స్ వంటి ఫైనాన్స్ సంస్థలకు సంబంధించి జిల్లాలో 83 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఈ కేసులను డిసెంబర్ 14న నిర్వహించే లోక్ అదాలత్‌లో త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా రోడ్లు, భవనాల శాఖ ఇఇ ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భీమవరంలో ఆర్చరీ పోటీలు

భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భీమవరం పట్టణం వంశీనగర్‌లోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో జిల్లా స్థాయి సీనియర్ ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్.జయరాజు శనివారం విలేకర్లకు తెలిపారు. పోటీల్లో పాల్గొనే సీనియర్ ఆర్చరీ క్రీడాకారులు రెండు ఆధార్ జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఆదివారం ఉదయం 8 గంటలకు అకాడమీ వద్దకు హాజరుకావాలన్నారు. గెలుపొందిన క్రీడాకారులు విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని చెప్పారు.

కాడి మోసిన కూతుళ్లు


తండ్రి కాడి మోస్తున్న కుమార్తెలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కంటే కూతుర్నే కనాలి అంటారు. ఆ కూతుళ్లు తండ్రి మరణించడంతో తల్లడిల్లిపోయారు. తండ్రి పాడెను శ్మశానం వరకూ మోసి తమ ప్రేమను చాటుకున్నారు. నగరంలోని 42వ డివిజన్‌కు చెందిన సామాజికవేత్త వెన్నెల కోట శ్రీనివాస్ శనివారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను శనివారం స్థానిక శ్మశాన వాటికలో నిర్వహించారు. తండ్రిపై ఉన్న అపారమైన ప్రేమతో కుమార్తెలు ఉష, దివ్య తండ్రి కాడిమోసి తమ రుణాన్ని తీర్చుకున్నారు.

చెట్ల నరికివేతపై అధికారుల నోటీసులు

సాక్షి ఎఫెక్ట్

పెంటపాడు: రావిపాడు గ్రామంలో వెంకయ్య కాలువ వెంట చెట్ల నరికివేతపై పంచాయతీ అధికారులు స్పందించాలని ఇరిగేషన్ ఏఈ కె.అనిల్ తేజ పేర్కొన్నారు. సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. అనుమతి లేకుండా చెట్లు నరకడం నేరమన్నారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేలా పూర్తి వివరణ పంచాయతీ కార్యదర్శికి ఇవ్వాలన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శికి ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

హాల్ టికెట్లు, సర్టిఫికెట్లు తక్షణం ఇవ్వాలి

ఏలూరు (మెట్రో): విద్యార్థులకు హాల్ టికెట్ల జారీలో, ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడంలో అధిక ఫీజులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి కళాశాలలను హెచ్చరించారు. అలాంటి కళాశాలల గుర్తింపును రద్దు చేస్తామని తెలిపారు. జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి ఫీజు రియింబర్స్‌మెంట్, మెస్ చార్జీలు మంజూరు చేస్తారన్నారు. హాల్ టికెట్లు ఇవ్వకపోయినా, ఒరిజినల్ ధ్రువపత్రాలు ఇవ్వకపోయినా, విద్యార్థులు జిల్లా కలెక్టరు గ్రీవెన్స్ నెంబరు 9491041188 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు



భీమవరంలో నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: పోలీసు శాఖ సమష్టిగా పనిచేసి నేరాల నియంత్రణకు అడ్డుకట్ట వేయాలని విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. శనివారం భీమవరంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని ముఖ్యమైన కూడళ్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. రోడ్ సేఫ్టీ, సైబర్ మోసాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ పెంచడం ద్వారా నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సులభతరమవుతుందని చెప్పారు .సమావేశంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) వి.భీమారావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం డీఎస్పీలు పాల్గొన్నారు.

కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం


ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామికి ప్రీతికరమైన రోజు, అందులోను కార్తీకమాస పర్వదినాలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు క్షేత్రానికి విచ్చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో పోటెత్తాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

ధాన్యం నిల్వలో మెలకువలు

పాడి-పంట




బి.నాగకుమార్
వ్యవసాయ శాఖ
అసిస్టెంట్ డైరెక్టర్

చింతలపూడి/దెందులూరు: ఖరీఫ్ మాసూళ్ళు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంటికి వచ్చిన ధాన్యాన్ని ఎలా భద్రపరుచుకోవాలో తెలియక రైతులు తికమక పడుతుంటారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని భద్రపరుచుకోడం రైతులకు సవాల్ లాంటిది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పండించిన పంటలో 10 నుండి 20 శాతం నష్టపోయే ప్రమాదం ఉందంటున్నారు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగకుమార్. ధాన్యం నిల్వ చేసుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరించారు. ధాన్యం నూర్చిన తరువాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికి పైగా భద్రపరచాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం రంగు, రుచి తగ్గుతుంది. సాధారణంగా వరి కోతల సమయంలో ధాన్యంలో 20 శాతం తేమ ఉంటుంది. కోసిన తరువాత వరి పనలను ఆరబెట్టడం వల్ల 4 నుంచి 6 శాతం తేమ తగ్గవచ్చు. ధాన్యంలో 14 శాతానికి మించి తేమ ఉంటే బూజు పట్టే అవకాశాలు ఉంటాయి. నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలుగజేస్తాయి. అంతేకాక ఎలుకలు ధాన్యాన్ని తినడమే కాక, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది. నిల్వ ఉంచిన ధాన్యాన్ని నష్టపరిచే కీటకాల విషయానికి వస్తే..

ముక్కు పురుగు

పంట కోయడానికి ముందు నుంచే ముక్కు పురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుండి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసి వేస్తుంది. ప్రౌఢ దశలోని ముక్కు పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.

వడ్ల చిలుక

ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే దాన్యం చెడు వాసన వస్తుంది. తల్లి కీటకం వడ్ల గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడుతుంది. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుని పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పై పొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తరువాత ఆ రంధ్రం ద్వార వడ్ల చిలుక బయటికి వస్తుంది. ఇది వడ్ల మూటలు, గిడ్డంగులపై కనిపిస్తుంది.

నుసి పురుగు

దీనినే పుచ్చ పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా 3 మి.మీ పొడవు ఉంటుంది. ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశలో చెత్తను, ఆ తరువాత గింజపై పొరను, ఆ తర్వాత లోపలి బియ్యపు గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి

రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేసుకోవాలంటే వెదురు గాదెలు, సిమెంటు గాదెలు, లోహపు గాదెల ద్వార నిల్వ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలను కుంటే గోదాంలు లేదా గిడ్డంగులను సిమెంటు కాంక్రీటుతో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా కీటకాలు, తేమ, వర్షపు నీరు లోనికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వలో కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచులపై, లోపల మలాథియాన్ లేదా ఎండోసల్ఫాన్ ద్రావణం స్ప్రే చేయాలి. మరునాడు సంచులను ఎండలో పెట్టాలి.

ఎలుకల నివారణకు చర్యలు

ధాన్యం గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండ రోజూ శభ్రం చేస్తుండాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింది భాగాలకు జింక్ రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్ మెస్ మూతలు అమర్చాలి.

విలియంకు స్టేషన్ బెయిల్


స్టేషన్ బెయిల్‌పై బయటకు వచ్చిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ విలియం కేరీ

ఆకివీడు : పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలంలోని చినమిల్లిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ విలియం కేరీని శుక్రవారం భీమవరం వన్‌టౌన్ పోలీసులు పిలిపించి విచారించారు. సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచి సెక్షన్ 41ఏ కింద కేసు నమోదు చేసి, స్టేషన్ బెయిల్‌పై రాత్రి విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ లీగల్ టీమ్ తనకు సహకారం అందించిందని విలియం కేరీ తెలిపారు.

నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ


నూజివీడు నుంచి తిరుమలకు వెళ్తున్న కూరగాయల వాహనం

నూజివీడు: మండలంలోని దేవరగుంటకు చెందిన నక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి నూజివీడు నుంచి 12 టన్నుల కూరగాయలు పంపారు. టీటీడీ నుంచి వచ్చిన ప్రత్యేక వాహనంలో కూరగాయలను లోడ్ చేసి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం వాహనాన్ని తిరుమలకు పంపించారు. అనేక మంది భక్తులు ప్రతినెలా తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదానానికి కూరగాయలను వితరణగా అందజేస్తున్నారన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు


మాట్లాడుతున్న తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ చైర్మన్ మహ్మద్ జహంగీర్

ఆకివీడు : స్వీయ రక్షణకు కరాటే ఆయుధం లాంటిదని తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ చైర్మన్ మహ్మద్ జహంగీర్ చెప్పారు. ఈ నెల 24న రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు ఆకివీడులో నిర్వహిస్తున్న సందర్భంగా శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కరాటే క్రీడ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాల్సి ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపై కసరత్తు జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో మండల, జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వచ్చే నెలలో కరాటే పోటీలు జరుగుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ విధంగా పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసిందన్నారు. గతంలో జగన్ ప్రభుత్వం కరాటే గుర్తింపునకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందన్నారు. తమ అసోసియేషన్ సభ్యుడు షేక్ ఎజ్‌దాన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ ఆకివీడులో నిర్వహిస్తున్నట్లు జహంగీర్ చెప్పారు. పోటీలకు జడ్జిగా ఆర్.వెంకటేశ్వరరావు ఉంటారన్నారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


కామయ్యపాలెంలో మత్తు పదార్థాల వినియోగంపై సదస్సు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం శివారు అటవీప్రాంతంలో శనివారం ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం దాడి చేశారు. దాడిలో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై కె.శ్రీనుబాబు తెలిపారు. అనంతరం కామయ్యపాలెంలో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కలిగించారు.

నాటుసారా విక్రేత పట్టివేత

ముసునూరు : అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి, సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏ.మస్తానయ్య తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని సూరేపల్లికి చెందిన చల్లారి ప్రియాంక నాటుసారా అమ్ముతుందనే సమాచారంతో సోదాలు నిర్వహించారు. రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా నల్ల బెల్లం కలిగి ఉన్నా, మద్యం , నాటుసారా విక్రయాలు, బెల్ట్‌షాపులు నిర్వహిస్తే దాడులు జరిపి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎక్సైజ్ అధికారుల దాడి

చింతలపూడి: చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పోతునూరులో నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో గ్రామానికి చెందిన చేకు ఆంజనేయులు నుంచి లీటర్ నాటు సారా స్వాధీన చేసుకున్నారు. చింతలపూడి మండలం శివపురం గ్రామంలో బెల్ట్ షాపు కేసులో ముద్దాయి కంచెర్ల మహాలక్ష్మిని చింతలపూడి తహసీల్దార్ ముందు హాజరుపరచి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాటు సారా, గంజాయి, డ్రగ్స్‌పై నాగిరెడ్డిగూడెం గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించి వారితో ప్రమాణాలు చేయించినట్లు చెప్పారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న పోరుమళ్ళ సుబ్బారాయుడు

జంగారెడ్డిగూడెం: డాక్టర్ అక్కరాయుడు కమిటీ నివేదిక ప్రకారం మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.31,500 ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమల్ల సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం జంగారెడ్డిగూడెంలోని లయన్స్ క్లబ్ హాలులో యూనియన్ అధ్యక్షుడు కూనపాముల విఘ్నేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారాయుడు మాట్లాడుతూ మున్సిపల్ అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పేరిట కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగటం లేదని, వెంటనే వేతనాలు పెంచాలన్నారు. కార్మికులకు క్యాజువల్ లీవులు అమలు చేయాలని జాతీయ పండుగ సెలవులు ఇవ్వాలన్నారు. ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పోరాటాలకు ఏఐటీయుసి మద్దతుగా ఉంటుందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, యూనియన్ జంగారెడ్డిగూడెం గౌరవ అధ్యక్షుడు జంపన వెంకటరమణరాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు చెక్


సైబర్ నేరాలపై 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలంటూ బ్రోచర్ ఇస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్ : ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వేదాంతి రామానుజాచారి ఫోన్‌ను దొంగిలించిన దుండగులు ఆయన ఖాతాలోని డబ్బును కాజేశారు. వెంటనే ఏలూరు సైబర్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయటంతో డబ్బు రికవరీ చేశారు. దీంతో రామానుజాచారి ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్‌ను ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వన్‌టౌన్‌కు చెందిన రామానుజాచారి ఫోన్ దొంగిలించిన దుండగులు అందులో సేవ్ చేసిన పాస్‌వర్డ్, యూజర్‌నేమ్‌తో బ్యాంకు ఖాతాలోని రూ.3.14 లక్షలు కాజేయడం ప్రారంభించారు. విషయాన్ని గుర్తించిన బాధితుడు సైబర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్‌సెల్ ఎస్సై మధు వెంకట రాజా దర్యాప్తు ప్రారంభించారు. బ్యాంకు అధికారుల సహకారంతో బాధితుడి ఖాతాను, నగదు ట్రాన్స్‌ఫర్ చేసిన ఖాతాలను ఫ్రీజ్ చేశారు. బాధితుడి ఖాతాలో ఇంకా రూ.2.81 లక్షల నగదు ఉంది.

కాలువలో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన రమేష్

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని కేతవరంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చాగంటి రమేష్(40) ఈ నెల 22న కట్టెలు తీసుకొస్తానని బయటకు వెళ్లాడు. రాత్రి కావస్తున్నా ఇంటికి రాకపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. శనివారం గ్రామంలోని కాలువ వద్ద రమేష్ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

క్లుప్తంగా

ఘనంగా జ్యోతిర్లింగార్చన


గణపతి ఆలయం వద్ద జ్యోతిర్లింగార్చన కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

అత్తిలి: కార్తీక మాసం సందర్భంగా అత్తిలి గణేష్‌చౌక్ సెంటర్‌లో గల వినాయక స్వామి ఆలయంలో జ్యోతిర్లింగార్చన కార్యక్రమం నేత్ర పర్వంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కొల్లేపర కుమార్, మాధవి దంపతులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతిర్లింగార్చనతో ఆలయ ప్రాంగణం శోభాయమానంగా వెలుగొందింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వీఎస్‌వీ ప్రసాద్‌కు అంతర్జాతీయ కవితా పురస్కారం


వీఎస్‌వీ ప్రసాద్, కవి

తణుకు అర్బన్: తణుకుకు చెందిన ప్రముఖ కవి, జిల్లా అభ్యుదయ రచయితల సంఘం మాజీ అధ్యక్షుడు వీఎస్‌వీ ప్రసాద్‌కు అంతర్జాతీయ కవితా పురస్కారం దక్కింది. బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14వ తేదీన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో బాల్యం అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కవితల పోటీలో నేటి బాల్యం అనే శీర్షికతో రచించిన కవితకు ఈ పురస్కారం దక్కినట్లు కవి ప్రసాద్ తెలిపారు. సుమారుగా 500 మంది కవులు పాల్గొన్న ఈ పోటీలో టాప్ 20లో దక్కిన స్థానంతో ప్రశంసాపత్రం, బహుమతి అందుకున్నట్లు వివరించారు.

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని తులసిమాలలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన జరిపారు.

రహదారి ప్రమాదాలపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రహదారి ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాస్ అన్నారు. రహదారి ప్రమాదాలపై సేఫ్ ఇండియాలో భాగంగా చిన్నతాడేపల్లి శ్రీచైతన్యకు చెందిన 300 మంది విద్యార్థులచే పట్టణంలో ఎస్‌వీఆర్ సర్కిల్ నుంచి తాలూకా ఆఫీస్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ జరిగింది. మానవహారం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణం చేసేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. హెల్మెట్ లేని వారికి గులాబీలు ఇచ్చి హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రసాద్, పాఠశాల డీన్ నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు


తణుకులో ప్రత్యేక అలంకరణలో వరసిద్ధి వినాయకస్వామి

తణుకు అర్బన్: కార్తీకమాసం సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం రకరకాల పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్టీ ఫౌండర్ కొమ్మిరెడ్డి సూరిబాబు ఆధ్వర్యంలో పూజాధికాలు జరిపారు.

తణుకులో మినీ చెత్త డంపింగ్ యార్డులు

- ఎక్కడి చెత్త అక్కడే
- అపరిశుభ్రంగా మారుతున్న ఖాళీస్థలాలు
- చెత్త, పందులకు ఆవాసంగా
- ఉండలేకపోతున్నామంటున్న ప్రజానీకం
- పొగపెట్టి చంపేస్తున్నారంటున్న వైనం


తణుకు నంబరు 13 మునిసిపల్ పాఠశాల ఎదురుగా అధ్వాన్నంగా ఉన్న ప్రాంతం

తణుకు అర్బన్: స్వచ్ఛభారత్, మోడల్ తణుకు వంటి సంస్కరణలకు తణుకు పట్టణంలో చెత్త నిల్వలు ఆటంకాలుగా నిలుస్తున్నాయి. జిల్లాలో ఏ ప్రాంతానికి వెళ్లినా తణుకు ప్రాంతం చాలా సుందరంగా ఉంటుందని, తణుకు తళుక్కుమంటుందనే నానుడి ఉంది. అటువంటి పచ్చని తణుకు నేడు చెత్తాచెదారాలకు నిలయంగా, పందులకు ఆవాసంగా మారిందని తణుకు వాసులు తిట్టుకుంటున్నారు. తణుకులో కొన్ని ప్రైవేటు ఖాళీ స్థలాలు మినీ డంపింగ్ యార్డులుగా మారి ఆ ప్రాంతాన్ని దుర్గంధ పూరితంగా మారుస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు నిలువుటద్దంగా తణుకు బొమ్మల వీధి ప్రాంతంలోని నంబరు 13 మునిసిపల్ పాఠశాల ఎదురుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రైవేటు ఖాళీస్థలం, సోమంచి వారి వీధిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలం, ముత్యాల వారి వీధిలోని ఖాళీ స్థలాలు, బాబు వారి వీధిలో రోడ్డు మార్జిన్‌లో చెత్త, వ్యర్థాలు ఆ ప్రాంతాల్లో తీవ్ర అపరిశుభ్ర వాతావరణాన్ని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా నంబరు 13 పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఈ అపరిశుభ్ర ప్రాంతంలో ఉండేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త పారవేయడమే కాకుండా మంటపెట్టి పొగరాజేస్తున్నారని, పొగపీల్చలేక చస్తున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇక సోమంచి వారి వీధి ఇరువైపులా మినీ కంపోస్టు యార్డుల్లా మారిపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులను సృష్టిస్తోంది. చెత్త, వ్యర్థాలకు తోడు పందులు తిష్టవేయడంతో ఈ ప్రాంతం ఒక మురికివాడగా మారిపోయిందని, గతంలో ఎంతో శుభ్రంగా ఉండే తణుకు ప్రాంతమేనా అనే రీతిలో ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఊరికి చివరగా భారీ కంపోస్టు యార్డు ఉన్నప్పటికీ పట్టణంలో మినీ కంపోస్టు యార్డులను ఏర్పాటు చేస్తున్నారా అనే విధంగా ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మినీ డంపింగ్ యార్డులుగా పిలవబడుతున్న ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు స్వయంగా చెత్తను డంపింగ్ చేస్తుండడం కూడా ఆశ్చర్యంగా కనిపిస్తోంది.

రోజు 50 టన్నులకు పైగా చెత్త..

తణుకు మునిసిపాలిటీపరిధిలోని 34 వార్డులో ప్రతి నిత్యం 50 టన్నులకు పైగా చెత్తను పారిశుద్ధ్య కార్మికులు సేకరించి కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. ఇందులో భాగంగా 8 ట్రాక్టర్లు, 25 ఆటోలు కంపోస్టుకు ప్రయాణిస్తున్నాయి. ఇద్దరు శానిటరీ ఇనస్పెక్టర్లు, 9మంది శానిటరీ మేస్త్రిలు, 165 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉంటున్నారు. ఈ గణాంకాలు గతం నుంచి ఉన్నవే అయినప్పటికీ గతంలో జరిగిన నిర్వహణ ఇప్పుడు ఎందుకు జరగడంలేదనేది సగటు వ్యక్తి ప్రశ్నగా మిగిలిపోతోంది. ఇప్పటికైనా చెత్తలను ఖాళీ స్థలాల్లో పారవేయకుండా నేరుగా కంపోస్టుకు తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు.

ఇంటి చెత్త నేరుగా కంపోస్టుకు వెళ్లదా?

గత ప్రభుత్వ హయాంలో ఇంటి చెత్త నేరుగా కంపోస్టు యార్డుకే అనే రీతిలో చెత్త సేకరణ జరిగేదని కానీ నేడు రోడ్లపై చెత్త నిల్వలు ఉంటున్నాయని, ఖాళీ స్థలం కనిపిస్తే చాలు మినీ డంపింగ్ యార్డుగా మారిపోతుందని ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త సేకరణలో ఇటు పాలకులకు, అటు శానిటరీ అధికారులకు చిత్తశుద్ధి లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ఒక పక్క జ్వరాలతో తాము అల్లాడుతుంటే తమ ఇంటి పరిసరాల్లోని ఖాళీ స్థలాలను మినీ డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నారంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా శానిటరీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ రకమైన ఇబ్బందులు వస్తున్నాయని ఎక్కడి నుంచో చెత్తను తెచ్చి తమ ఇళ్ల వద్ద పారవేస్తున్నారంటూ చెత్త నిల్వ ప్రాంత నివాసితులు వాపోతున్నారు.


తణుకు సోమంచి వారి వీధిలో రోడ్డుకి ఇరువైపులా చెత్త


తణుకు ముత్యాల వారి వీధిలో ప్రైవేటు స్థలంలో పేరుకున్న చెత్త


తణుకు బాబు వారి వీధిలో రోడ్డు మార్జిన్‌లో కొబ్బరిబొండాలు, చెత్త

నిలిచిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్


నవాబుపాలెం ట్రాక్‌పై నిలిచిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం వద్ద జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కొన్ని నిమిషాల పాటు నిలిచిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ట్రాక్‌పై నుంచి కంటెయినర్‌ను తీసుకెళ్లే క్రమంలో అప్పటికే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు సిగ్నెల్ ఇవ్వడంతో ట్రాక్‌పైకి వచ్చింది. అయితే ట్రాక్‌పై ఉన్న కంటెయినర్ తొలగింపులో ఆలస్యం కావడంతో అప్రమత్తమైన గేట్‌మేన్ అత్యవసరంగా రెడ్ సిగ్నెల్ ఇవ్వడంతో లోకో పైలట్ వెంటనే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపివేశారు. గేట్ మ్యాన్ సమయస్ఫూర్తితో పెద్ద ప్రమాదం తప్పిందని చెప్పవచ్చు.

జల్ జీవన్ పనులు పూర్తి చేయాలి

తణుకు టౌన్: మండలంలోని వేల్పూరు గ్రామంలో అసంపూర్తిగా ఉన్న జల్‌జీవన్ పనులు పూర్తి చేయాలని గ్రామ సీపీఎం కమిటీ డిమాండ్ చేసింది. శనివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామంలో జల్ జీవన్ మిషన్ త్వరగా పూర్తి చేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. వేల్పూరు గ్రామ ప్రజలకు కుళాయిల ద్వారా మంచినీరు అందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇంటింటికి ఉచితంగా రక్షిత మంచినీటిని పైప్‌లైన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ లక్ష్యంతో చేపట్టిన ఈపనులను పూర్తి చేయాలని కోరారు. గ్రామంలోని ప్రతీ ఇంటికీ కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, యండమూరి నాగేంద్ర, కె వీరభద్రరావు, ఆర్ శ్రీనివాస్, అల్లం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదును పరిశీలించిన తహసీల్దార్


అత్తిలి మండలం కంచుమర్రులో ఓటరు నమోదు దరఖాస్తును స్వీకరిస్తున్న తహసీల్దార్ దశిక వంశీ

అత్తిలి: మండలంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ దశిక వంశీ శనివారం పరిశీలించారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారు తప్పనిసరిగా ఓటర్లగా నమోదు కావాలన్నారు. అత్తిలి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కొత్తగా ఓటర్లుగా చేరేవారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కంచుమర్రు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ తనిఖీ చేసారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. భోజనం రుచిగా ఉన్నదీ, లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఆర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

తణుకు టౌన్: ఆహార పదార్థాల ప్యాకెట్ల కొనుగోలులో నాణ్యతా ప్రమాణాల పట్ల వినియోగదారులు అవగాహనతో మెలగాలని జాతీయ వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు చెప్పారు. శనివారం తణుకులో వినియోగదారుల అవగాహనపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఆహార పదార్థాల ప్రమాణాల సంస్థ ఉత్తర్వుల ప్రకారం ప్రతి ఆహార పదార్థాల ప్యాకింగ్‌పై ఎఫ్ఎస్ఎస్ఏఐ అనే చిహ్నం ఉండాలని చెప్పారు. ఈసందర్భంగా సౌత్ మెగా కన్స్యూమర్ ఎవేర్‌నెస్ క్యాంపెన్‌కు సంబంధించిన గోడ పత్రికను తహసీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు జీఎస్ఆర్ శంకర్, డిప్యూటీ తహసీల్దార్‌లు శ్రీదేవి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పగలే వెన్నెల

- లేకపోతే అంధకారం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


పట్టణంలో పగలు వెలుగుతున్న వీధి లైట్లు


పట్టణంలో పలు ప్రాంతాలలో రాత్రి సమయాలలో వెలగని వీధి లైట్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పగలే వెన్నెలగాను...లేకపోతే అంధకారం (చీకటి)గాను అన్న చందానా తాడేపల్లిగూడెం పురపాలక సంఘం వీధి లైట్లు పరిస్థితి ఉంది. తాడేపల్లిగూడెం పట్టణంలోని పలు వీధుల్లో రాత్రి సమయాల్లో వీధి లైట్లు సరిగా వెలగడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొన్ని వీధులలో కొన్ని లైట్లు మాత్రమే వెలుగుతున్నాయని ఆయా ప్రాంతాల వాసులు అంటున్నారు. మరి కొన్ని వీధులలో వెలిగితే పగలు, రాత్రి అనే తేడా లేకుండా స్ట్రీట్ లైట్లు వెలుగుతున్నాయని ఒక్కొక్క సందర్భంలో అసలు వెలగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై పలు మార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా వార్తల రూపంలో ప్రచురించినా సంబంధిత అధికారులలో చలనం లేకపోవడం విచిత్రమని అంటున్నారు. పగలు సమయంలో వీధిలైట్లు ఆపకపోతే విద్యుత్ ఆదా చేయడం కష్టతరమని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాలలో రాత్రి సమయాలలో లైట్లు డిమ్‌గా వెలగడం, లేకపోతే అసలు వెలగకపోవడం జరుగుతుందని చెబుతున్నారు. పాడైన సమయంలో వీధిలైట్లు కొత్తవి తెచ్చి వేసినా రెండు, మూడు రోజులలో అవి పోతున్నాయని పలువురు వాపోతున్నారు. ఎన్నో ప్రాంతాలలో రాత్రి సమయాలలో ముఖ్యంగా ఖాళీ స్థలాలు, పొదలు, అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు ఉన్న ప్రాంతాలలో స్ట్రీట్‌లైట్లు వెలగకపోవడం వల్ల ఆయా ప్రాంతాల ప్రజలు బిక్కు బిక్కుమని జీవిస్తున్నట్లు అంటున్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు సిబ్బంది నిర్లక్ష్యవైఖరి కారణంగా ఈ పరిస్థితి నెలకుంది. కొన్ని స్ట్రీట్‌లైట్లులో మైనర్ రిపేర్లు ఉన్నా వాటిని సరిదిద్దేందుకు సంబంధిత సిబ్బంది ప్రయత్నించకపోవడం వల్ల రాత్రి సమయంలో వీధులన్ని చీకటిమయంగా ఉంటుంది. ఇప్పటికైన సంబంధించిన అధికారులు స్పందించి రాత్రి సమయంలో స్ట్రీట్ లైట్లు వెలిగే విధంగాను, పగలు సమయంలో వాటిని ఆపుచేసే విధాంగాను చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీధి లైట్ల నిర్వహణ సక్రమంగా ఉండాలి



పట్టణంలో ఆయా ప్రాంతాలలో వీధి లైట్లు నిర్వహణ బాగోలేదు. రాత్రి సమయాలలో స్ట్రీట్ లైట్లు చాలా ప్రాంతాలలో వెలగడం లేదు. కొన్ని ప్రాంతాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు, తరువాత రాత్రి అంతా వీధి లైట్లు అలానే ఉంటున్నాయి. పట్టపగలు విద్యుత్‌ను ఆదా చేయలంటే తప్పనిసరిగా వీధి లైట్లును ఆపాలి. అధికారులు స్పందించాలి.

– ఎ.త్రినాథ్, తాడేపల్లిగూడెం

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


తణుకు టౌన్: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ


తాడేపల్లిగూడెం(టీఓసీ): ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని తణుకు ఎక్సైజ్ సీఐ ఎస్ మణికంఠ రెడ్డి చెప్పారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా తణకులోని సాయి జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంపై ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ మధుబాబు, హెడ్ కానిస్టేబుల్ కె శ్రీనివాసు, కానిస్టేబుల్ ఫణిభూషణ్, కళాశాల చైర్మన్ జీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జీ అవినాష్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): నేటి యువత డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని చేయాలని పట్టణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కేఎస్‌వి కల్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. ప్రొహిబిషన్ కమిషనర్ నిశాంత్ కుమార్ ఆదేశాలు మేరకు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాల దుర్వినియోగం, నాటు సారా తదితర అంశాలపై శనివారం అవగాహన కార్యక్రమాలు గణపవరం మండలంలోని పిప్పర గ్రామంలో నిర్వహించారు. నాటు సారాయి వినియోగం వాటి వల్లన కలిగే దుష్ప్రయోజనాలపై ప్రజలకు వివరించారు. మనిషి జీవితం నాశనం చేసుకోవడానికి ఒక్క నిమిషం సరిపోతుందని అదే బాగుచేసుకోవాలంటే చాలా కష్టపడాలని అన్నారు. ఏదైనా తప్పు చేసేటప్పుడు ఒక్కసారి మన కోసం మన తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. మంచి కన్నా చెడు అత్యంత వేగంగా ఆకర్షిస్తుందనే విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. ప్రజల చేత నాటు సారాయి, మత్తు పదార్థాలు వినియోగించనని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మాధవరంలో అవగాహన ర్యాలీ


మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలని, తద్వార ప్రజారోగ్యాన్ని పరిరక్షించవచ్చన్నారు. అనంతరం బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.ఫణికుమార్, గుమస్తా శ్రీనివాస్, ఎంఆర్‌సీఎం రవికిరణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కోతలు వాయిదా వేసుకోవాలి

అత్తిలి: వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో తుఫాన్ ప్రభావంతో మంగళ, బుధవారాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రెండురోజుల పాటు వరికోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. నూర్పిడి చేసిన ధాన్యం ఉంటే వెంటనే మిల్లులకు తరలించాలని రైతులకు సూచించారు.

వైభవంగా సత్యసాయి వ్రతాలు


సత్యసాయి మందిరంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో సత్యసాయి జయంతి సందర్భంగా స్థానిక సత్యసాయి మందిరంలో శనివారం మందిర కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్థనరావు ఆధ్వర్యంలో 80 మంది మహిళలచే సత్యసాయి వ్రతాలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, నగర సంకీర్తన, ఇతర పూజలు జరిగాయి. ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నదానంను ప్రారంభించారు. ఏరియా ఆసుపత్రిలో కూడ అన్నదానం చేశారు. సాయంత్రం నామ సంకీర్తన, ఉయ్యాల ఉత్సవం జరిగాయి. ఈ కార్యక్రమంలో సవీన్ బాబా, ప్రవా శ్రీనివాస్, విష్ణుమూర్తి, గాదె శ్రీరామచంద్రమూర్తి, సేవా సమితి సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత ధ్యాన, యోగా శిక్షణ తరగతులు


ఉచిత ధ్యాన, యోగా శిక్షణా తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యంగా సకారాత్మ ఫౌండేషన్ సంకల్ప సమాధి యోగా ఆధ్యాత్మిక ఆరోగ్య సేవా సంస్థ సిద్ధ ఆశ్రమం ఉచిత ధ్యాన యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ప్రేమ్ నిరంతర్ గురూజీ తెలిపారు. శనివారం భీమవరంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని అల్లూరి సీతారామ సాంస్కృతిక కేంద్రంలో ఈనెల 25 వ తేదీ నుంచి 21 రోజులపాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా ఈ నెల 24 సాయంత్రం 6 గంటలకు పరిచయ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ప్రారంభిస్తారన్నారు. సోమవారం నుంచి ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7.15 నిమిషాల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం సెక్రటరీ చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ సంపూర్ణ ఆనందం, ధ్యానము, యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ఆహారపు అలవాట్లు, జీవిత తత్వజ్ఞానం, ధ్యాన, యోగ శిక్షణ అందరూ నేర్చుకుని ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం ఉచిత ధ్యాన యోగ శిక్షణా తరగతులు కరపత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో టి.శ్రీనివాస్, కె.దామోదరరావు, రామకృష్ణంరాజు, ఎంఎస్ఎస్ రాజు, జి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని నేటి ఓటమి రేపటి విజయానికి నాందిగా మలుచుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడామైదానంలో 16వ ఈషా గ్రామోత్సవం రూరల్ ప్రీమియం లీగ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆహ్లాదాన్ని అందిస్తాయని విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని యువత గుర్తించాలన్నారు. క్రీడా స్ఫూర్తి క్రీడాకారులకు చాలా అవసరమని, ఇటువంటి క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ ప్రతిభ కనబర్చి పథకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో డీఎన్నార్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ ఇలాంటి క్రీడల పోటీలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈషా ఫౌండేషన్ డి.విజయ, ఉపేంద్రవర్మ, కేపీ వర్మ మాట్లాడుతూ మొదటి లెవల్ (క్లస్టర్) మ్యాచ్‌లు రెండు రోజులపాటు పురుషులు వాలీబాల్, స్త్రీలు త్రో బాల్ పోటీలు జరుగుతాయన్నారు. వీటిలో గెలుపొందిన క్రీడాకారులు రెండో లెవల్ లోకి అర్హత సాధిస్తారని అక్కడ విజయం సాధిస్తే డిసెంబరు 28న కోయంబత్తూరులో జరిగే ఫైనల్స్ పాల్గొంటారని వివరించారు. ఫైనల్స్ విజేతలకు రూ. 5 లక్షల బహుమతి అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్ రావి రాంబాబు, కళాశాల పాలకవర్గ సభ్యుడు కునపరాజు రామకృష్ణంరాజు, బీవీ నర్సింహరాజు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో మంచినీటి సరఫరా

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘీక సంక్షేమ, గురుకుల పాఠశాలలో మోటారు చెడిపోవడంతో విద్యార్థులకు స్థానిక పంచాయతీ నుంచి వాటర్ ట్యాంకు, ఇతర అవసరాలకు సమీపంలోని పాత పాఠశాల నుంచి పైపుల ద్వారా సరఫరా చేశారు. తాగు నీటి కోసం మినరల్ వాటర్‌ను సరఫరా చేసినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఎం. దుర్గారావు శనివారం తెలిపారు. వెంటనే స్పందించి మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు.